క్లుప్తంగా

ముంపు నీటి తొలగింపునకు రైతులకు తప్పని తిప్పలు


జేసీబీలతో పనులు చేయిస్తున్న రైతులు

దెందులూరు: గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చేలల్లో ఉన్న నీరు దిగువ ప్రాంతానికి వెళ్లక రైతులకు తిప్పలు తప్పడం లేదు. దీంతో రైతులు స్వచ్ఛందంగా ముంపు నివారణ చర్యలు ప్రారంభించారు. జేసీబీతో బోదెల ద్వారా వర్షపు నీరు దిగువ ప్రాంతానికి వెళ్లేలా అడ్డంకులు తొలగించారు. బోదెల్లో ఉన్న తూడు, తుప్పలు, మట్టి దిబ్బలను తొలగించి నీరు కిందకివెళ్లేలా చర్యలు చేపట్టారు. ఇంకా మూడు రోజులు భారీ వర్షాలు ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జేసీబీలతో చేస్తున్న ముంపు నివారణ పనులతో చెరువుల మాదిరిగా ఉన్న చేలు పొలాలుగా కనబడుతున్నాయి.

'ఉపాధి'లో నిమ్మ సాగు


ఉపాధి హామీలో సాగవుతున్న నిమ్మ తోట

దెందులూరు: మెట్ట ప్రాంత రైతులు జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో ఫాతిమా ప్రసన్న అన్నారు. మంగళవారం రామారావుగూడెం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో సాగు చేస్తున్న నిమ్మ మొక్కలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. గ్రామంలో రైతులకు ఎకరాకు 110 మొక్కలు చొప్పున పూర్తి సబ్సిడీ ఇచ్చామన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ నాగదుర్గ, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ, రైతులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు గణనాథులు సిద్ధం


అమ్మకానికి సిద్ధంగా ఉన్న గణనాథులు

దెందులూరు: వినాయక చవితి ఉత్సవాలకు గణనాథులు సిద్ధమయ్యారు. గాలాయగూడెం, గోపన్నపాలెం గ్రామాల్లో వర్తకులు ప్రత్యేకంగా గణనాథుల విగ్రహాలను తయారు చేసి విక్రయానికి సిద్ధం చేశారు. నవరాత్రుల విశిష్టత ప్రతిబింబించేలా అన్ని అవతారాల్లో విగ్రహాలను రూపొందించామని అందరికీ అందుబాటులో ధరలు ఉండేలా తయారు చేశామని విక్రయదారుడు సుధీర్ అన్నారు.

సాగు నిమిత్తం స్ప్రేయర్లు అందించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరాజు

దెందులూరు: సాగు నిమిత్తం స్ప్రేయర్లను అందించాలని రైతులు అధికారులను కోరారు. మంగళవారం సీతంపేట గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయాధికారి శ్రీనివాసరాజు నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభించిన వెంటనే గ్రామ రైతులు సాగులో సౌకర్యాలు కల్పిస్తే తమకు ఇబ్బందులుఉండవని కోరారు.

వైభవంగా పవిత్రాధివాసం

ద్వారకాతిరుమల: శ్రీవారి దత్తత ఆలయమైన లక్ష్మీపురం శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీనివాసుని దివ్య పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం పవిత్రాధివాసం కార్యక్రమాన్ని అర్చకులు వేడుకగా నిర్వహించారు. యాగశాలలో పవిత్రాలను ఉంచి, విశ్వక్సేనపూజ, పుణ్యహావాచనం చేశారు. పంచగవ్యప్రోక్షణ చేసి అగ్నిప్రతిష్ఠాపన నిర్వహించారు. ఆలయ ఆవరణలో పవిత్రాలనుఉంచి ప్రోక్షణ గావించారు. పవిత్రాలకు, ఉత్సవమూర్తులకు పంచశయ్యా ధివాసాన్ని అర్చకులు, పండితులు వేద మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. మహాశాంతి హోమం నిర్వహించారు. ఆలయ ఈఓ ఎన్వీ సత్యనారాయణ మూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మార్మోగిన హనుమన్నామ స్మరణ

జంగారెడ్డిగూడెం: స్వయంభూః శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయం మంగళవారం హనుమన్నామ స్మరణతో మార్మోగింది. తెల్లవారుఝామున అర్చకులు స్వామివారికి ప్రభాతసేవ, నిత్యార్చన పూజలుచేశారు. స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి, స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.1,27,873 సమకూరినట్లు ఈఓ ఆర్వీ చందన తెలిపారు. స్వామి వారిని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు దర్శించుకున్నారు.

సమస్యల వలయంలో బాలికల వసతి గృహం


శిథిలావస్థకు చేరిన వసతి గృహ భవనం


చేబ్రోలు హైస్కూల్ భవనంలోకి మార్చిన వసతి గృహం


ప్రస్తుతం ఉన్న రెండు మరుగుదొడ్లు ఇవే

- శిథిలావస్థకు చేరిన వసతి గృహ సొంత భవనం
- కొత్తగా మార్చిన భవనంలో అరకొర వసతులు
- పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థినులు

ఉంగుటూరు: మండలంలోని చేబ్రోలు బాలికల వసతి గృహం పరిస్థితి అధ్వానంగా మారింది. ఇందిరా కాలనీలో ఉన్న సొంత భవనం బీటలు వారింది. శ్లాబ్ పెచ్చులు ఊడి పడిపోతున్నాయి. 1988లో ఈ వసతి గృహన్ని నిర్మించారు. ఏనాడో నిర్మించిన భవనం నాలుగు దశాబ్దాలు కావస్తుండటంతో శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఈ భవనం మరమ్మతులకు పనికిరాదని ఇంజనీరింగ్ డిపార్ట్మెంటు వారు సర్టిఫికెట్ ఇచ్చేశారు. సోషల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులకు తెలియజేయడంతో బిల్డింగ్ మార్చడం అనివార్యమైంది. దీంతో ఈ వసతి గృహాన్ని చేబ్రోలు గ్రామంలోనే వేరే చోటకు మార్చారు. చేబ్రోలు బాలికల హైస్కూలు వద్ద ఖాళీగా ఉంటున్న స్కూలు భవనంలోకి ఇటీవల మార్చారు. బిల్డింగు బాగానే ఉంది. కాని వసతి గృహంలో ఉంటున్న 50 మందికి సరిపడా మరుగుదొడ్లు లేవు. దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వంటను పాఠశాల అరుగుపై చేస్తున్నారు. ఇలా కాలం వెళ్లదీస్తున్నారు. పాత భవనం వద్ద విద్యార్థులకు సరిపోయే మరుగుదొడ్లు ఉన్నాయి. అక్కడ బాగా ఉండేది. ఇక్కడ రెండు మరుగుదొడ్లు ఉండటంతో ఏక కాలంలో విద్యార్థులు స్నానాలు చేయడానికి అవడం లేదు. అలాగే ఇతర అవసరాలు తీరడం లేదు. బిల్డింగు బాగోలేదని పెచ్చులు ఊడిపోతున్నాయని బిల్డింగు మారిస్తే ఇక్కడ అనేక సమస్యలు ఎదుర్కోవలసి వస్తోంది. ఇలా చేబ్రోలు వసతి గృహంలో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఒకప్పుడు జిల్లాలోనే పేరుగాంచిన వసతి గృహాల సరసన చేబ్రోలు వసతి గృహం ఉండేది. అప్పట్లో వంద మందికి పైనే పిల్లలు ఇక్కడ చదివేవారు. అలాంటి వసతి గృహం నేడు సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది.

బాగానే ఉందంటున్న వార్డెన్

చేబ్రోలు వసతి గృహం సొంత భవనం శిథిలావస్థకు చేరడంతో సోషల్ వెల్ఫేర్ ఇంజనీర్ల సూచన మేరకు మార్చాల్సి వచ్చిందని చేబ్రోలు వసతి గృహం మేట్రిన్ మీరాబాయ్ తెలిపారు. మార్చిన తరువాత నడుస్తున్న భవనం బాగానే ఉందని తెలిపారు. మరుగుదొడ్లు కొన్ని ఉన్నాయని, వాటి దగ్గర్లోనే నిరుపయోగంగా ఉన్న వాటిని బాగు చేయించి రన్నింగులోకి తెచ్చామని ప్రస్తుతం బాగానే ఉందని మీరాబాయ్ వివరించారు. ప్రస్తుతం 50 మందితో నడుస్తోందని మరో పది మంది చేరబోతున్నారని మీరాబాయ్ వివరించారు.

అంగన్వాడీ విద్యతో చిన్నారుల్లో సృజనాత్మకత


అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్జేడీ

భీమడోలు: పూర్వ ప్రాథమిక విద్య ద్వారా అంగన్వాడీ చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను అందించడం ద్వారా చిన్నారుల్లో సృజనాత్మకత పెరుగుతుందని ఏలూరు జోన్ ఆర్జేడీ బి.సుజాత రాణి అన్నారు. భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని కురెళ్లగూడెం, పూళ్ల గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఇటీవల కేంద్రాలకు పంపిణీ చేసిన స్మార్ట్ టీవీ వినియోగంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రంలో అమలు చేస్తున్న కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రీ స్కూలు చిన్నారులతో కొద్ది సేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా సమర్ధవంతంగా సేవలను అందించేందుకు కార్యకర్తలు తమ వంతు కృషి చేయాలన్నారు. కేంద్రాల పరిధిలో బాల్య వివాహాలు జరగకుండా కిశోరి వికాసం ద్వారా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీవో ఎంఎస్ రాజశేఖర్, సూపర్వైజర్ నూర్జహాన్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి


యూజే విల్సన్ సీఐ, భీమడోలు

భీమడోలు: గణేష్ ఉత్సవాల నిర్వాహకులు విధిగా ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సిందేనని భీమడోలు సీఐ యూజే విల్సన్ అన్నారు. భీమడోలులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగాను, భక్తి భావంతో నిర్వహించేందుకు ఉత్సవాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. భీమడోలు సర్కిల్ పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల పోలీస్స్టేషన్పరిధిలో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించే కమిటీ సభ్యులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయాలనుకున్న వారు పంచాయతీ అనుమతులు తీసుకోవాలన్నారు. సొంత స్థలాల్లో గణేష్ విగ్రహాలు ఏర్పాటుచేసుకునేవారుకూడా స్థలం యాజమాని అనుమతి పొందాలన్నారు. ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ ద్వారా డీఎస్పీ నుంచి అనుమతి తీసుకోవాలని, మైకులు, సౌండ్ బాక్స్లు పెట్టుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. రాత్రి 10 గంటల తరువాత ఎటువంటి కార్యక్రమాలు చేపట్టరాదన్నారు. మండపాల డెకరేషన్కు అవసరమైన విద్యుత్ సౌకర్యం కోసం విద్యుత్ శాఖ నుంచి అనుమతులు పొందాలన్నారు. ఇతర మతాల వారికి ప్రార్థన మందిరాలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. విభేధాలకు చోటు ఇవ్వకుండా శాంతి కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బలవంతంగా చందాలు వసూలు చేయరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

మునిగిన పంట పొలాల పరిశీలన


ముంపు పొలాలను పరిశీలిస్తున్న డాట్ సెంటర్ సీనియర్ శాస్త్రవేత్త ఫణికుమార్, వ్యవసాయ సిబ్బంది

భీమడోలు: మండల వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పలు గ్రామాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు భీమడోలు, గుండుగొలను, పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురం గ్రామాల్లో 560 ఎకరాల్లో పంట చేలు నీట మునిగి నానుతున్నాయి. మంగళవారం కూడా వర్షం కురవడంతో రైతులు మరింత ఉలిక్కిపడ్డారు. గ్రామాల్లోని పంట పొలాల చుట్టూ ఆక్వా చెరువులు, కొల్లేరు సరస్సుకు సమీపంలో ఉండడంతో ఎగదన్నుతున్న నీటి వలన పంట చేలు మునగడంతో నాట్లు కుళ్లిపోతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తమకు నష్ట పరిహారాన్ని అందించాలని వారు కోరుతున్నారు. ఎంఎంపురం ఏరియాలో ముంపు నీరు వెళ్లే మార్గాలు మూసుకుపోవడంతో నీరు పొలాల్లోకి చేరుతుంది. ఇదిలా ఉండగా ఏలూరులోని డాట్ సెంటర్ వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం, స్థానిక వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి భీమడోలులో ముంపు బారిన పడిన పంట పొలాలను పరిశీలించారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.ఫణికుమార్, శాస్త్రవేత్తలు నాగేంద్ర, రమేష్ మునిగిన పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలందించారు. ముంపు బారిన పడిన పంట పొలాలను తేరుకునేందుకు తీసుకోవాల్సిన మెలకువలను రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో ఉషారాణి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏడీఏ

పెదపాడు: సహకార సంఘాలు, ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో ఎరువులను రైతులకు సక్రంగా అందించాలని ఏలూరు ఏడీఏ అనీల్కుమారి తెలిపారు. పెదపాడు మండలంలోని ప్రైవేట్, సహకార సంఘాల్లో ఎరువుల దుఖాణాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల దుకాణాల్లో రశీదు పుస్తకాలను, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఏడీఏ అనీల్కుమారి మాట్లాడుతూ ఎరువులు అందుబాటులో ఉంచాలని ఎటువంటి అవకతకలకు పాల్పడినా వారిపై కఠిన చర్యలు చేపడతామన్నారు. ఎరువులు ఎలాంటి కొరత లేదని ఎవరైనా కృత్రిమ కొరతను సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువుల విక్రయం ఈ పోస్ యాంత్రాల ద్వారా చేపట్టాలని, రైతులు తప్పకుండా తమ ఆధార్ కార్డులను తీసుకొని రావాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.కృష్ణ జ్యోతి, వ్యవసాయ అధికారి షేక్ ఇమామీ ఖాసిమ్ తదితరులు పాల్గొన్నారు.

లంక గ్రామాలకు పొంచి ఉన్న ముప్పు


వరద పరిస్థితిని పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయరాజు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలంలో లంక గ్రామాల్లో వరద ముంపు పొంచి ఉంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొల్లేరుతో పాటు లంక గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని అంచనా వేసిన ఏలూరు రూరల్ తహసీల్దార్ జి.విజయకుమార్రాజు ఉద్యోగులను, ప్రజలను అప్రమత్తం చేశారు. వరద పెరుగుతున్న నేపథ్యంలో వర్షాలు తగ్గుముఖం పట్టని కారణంగా లంక గ్రామాలకు వరద ముప్పు పొంచి ఉందని ప్రజలు అప్రమత్తంగా కోమటిలంక గ్రామంలోఉండాలని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. గేదెలను బయటకు తీసుకురావొద్దని కొల్లేరులో పడవపై తక్కువ మంది మాత్రమే ప్రయాణించాలన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణం చేయొద్దని సూచించారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో గ్రామాల వారీగా లంక గ్రామాల పరిస్థితిని సమీక్షించారు. మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ అజయ్, వీఆర్వోలు, తహసీల్దార్ వెంట ఉన్నారు.

దోమల నివారణతోనే ఆరోగ్యం


సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

భీమడోలు: దోమల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఏలూరు జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు అన్నారు. గుండుగొలను పీహెచ్సీ పరిధిలోని భీమడోలు పంచాయతీ పరిధిలోని ఆర్జావారిగూడెంలో మంగళవారం పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. వర్షాకాలంలో అధికంగా వానలు కురుస్తున్నందున మురుగునీరు ఎక్కడపడితే అక్కడ నిలుస్తుందని, దీని వలన వ్యాధులు వ్యాపించే అవకాశాలున్నందున, ప్రతి ఒక్కరూ వారానికోసారి ఇంటి బయట ఉండే పరిసరాలను శుభ్రం చేసుకోవాలని, లేని పక్షంలో వ్యాధులు సంక్రమిస్తాయని పేర్కొన్నారు. దోమ కాటు ప్రమాదమని, నివారణకు సమష్టిగా పనిచేయాలని సూచించారు. నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఎబేట్ ద్రావణాన్ని పిచికారీ చేశారు. 50 గృహాల్లో పైరత్రం మందును పిచికారీ చేయించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ రామకృష్ణ, ఎంఎల్హెచ్పీ కరుణ, హెల్త్ అసిస్టెంట్లు మేకా శ్రీనివాసరావు, మురళీ, శ్రీనివాస్, కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బిడ్డల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పీడీ శారద

పెదవేగి: గర్భిణులు, బాలింతలు తీసుకొనే జాగ్రత్తలపైనే బిడ్డ ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శారద అన్నారు. పెదవేగి మండలం ముండూరు గ్రామంలో ముండూరు 1, 3 అంగన్వాడీ కేంద్రాలను పీడీ కె.శారద ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పూర్వ ప్రాథమిక విద్య, పౌష్టికాహారం, రికార్డుల పరిశీలన చేసిన పీడీ మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. బాలింతలకు బిడ్డకు పాలిచ్చే విధానం గురించి తల్లులకు తెలిపారు. అనంతరం చిన్నారులతో మమేకమైన పీడీ వారికి అక్షరాలు, అంకెలు, వాహనాలను గుర్తుపట్టడం కథలు లాంటివి అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో సెక్టార్ సూపర్వైజర్ సీహెచ్ పార్వతి. అంగన్వాడీ కార్యకర్తలు జి.లతకుమారి, వి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. శివ కల్యాణం


శివ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో శివదేవుని కల్యాణ మహోత్సవం మంగళవారం నేత్రపర్వంగా జరిగింది. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని అట్టహాసంగా నిర్వహించిన ఈ వేడుక భక్తులకు కనువిందు చేసింది. మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి, అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేసి కల్యాణ తంతును ప్రారంభించారు. సుముహూర్త సమయంలో నూతన వధువరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేశారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, భక్తుల శివ నామస్మరణల నడుమ మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలను కనులపండువగా నిర్వహించారు. కల్యాణ మూర్తులకు హారతులిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ఓట్ల దొంగలు గద్దె దిగే వరకు పోరాటం

పెదవేగి: ఏఐసీసీ ఆదేశాలతో ఓట్ చోర్ -గద్దె చోర్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఎ.నరసింహమూర్తి అన్నారు. మండలంలోని ముండూరులో విలేకరులతో మాట్లాడుతూ ఓట్ల దొంగలు గద్దె దిగేవరకు పోరాడతామని చెప్పారు. ప్రజాస్వామ్య పద్ధతిలో న్యాయపోరాటానికి సన్నద్ధమని అన్నారు.

'పది'లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి


విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈవో

నిడమర్రు: వచ్చే ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని నిడమర్రు ఎంఈవో-2 యర్రంశెట్టి శేషగిరిరావు అన్నారు. మంగళవారం ఆయన అడవికొలను హైస్కూలును సందర్శించి, పదో తరగతి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఆరా తీశారు. గత నెల రోజుల నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభించి, వెనుకబడ్డ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు హెచ్ఎం అందే రాంబాబు తెలిపారు. నూతనంగా ప్రవేశపెట్టిన మూల్యాంకన పుస్తకాలను ఆయన పరిశీలించారు. ఈ నెల 25వ తేదీలోగా ఎస్ఏఎంపీ పరీక్షా పత్రాల మూల్యాంకనం పూర్తి చేయాలని కోరారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీఆర్పీ దాసు, ప్రథమ సహాయోపాధ్యాయులు బొండా నర్సింహం, జేపీ కాకిలేటి శ్రీను పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు: ఉంగుటూరు సెక్షన్ పరిధిలో నారాయణపురం సబ్స్టేషన్ నుంచి నిడమర్రు సబ్స్టేషన్కు ఆర్డీఎస్ఎస్లో నూతనంగా నిడమర్రు ఫీడర్ను నిర్మించనున్నారు. ఈ పనుల నిమిత్తం ఈ నెల 20వ తేదీ బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నారాయణపురం సబ్స్టేషన్ పరిధిలో బాదంపూడి రూరల్ ఫీడర్కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. కావున రాచూరు, రావులపర్రు, సీతారాంపురం గ్రామాలకు, చేపల చెరువులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

రహదారులు ఇలా.. ప్రయాణం ఎలా?


గణపవరం పోలీస్ ఐలెండ్ వద్ద రోడ్డుపై గోతులతో అవస్థలు పడుతున్న ప్రయాణికులు


భారీ గోతులతో గణపవరం-ఏలూరు ప్రధాన రహదారి

గణపవరం: అసలే అంతంత మాత్రంగా ఉన్న రోడ్ల పరిస్థితి భారీ వర్షాలకు మరింత దిగజారింది. రోడ్లపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వాహనదారులకు ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. రాత్రి వేళల్లో అయితే పరిస్థితి మరింత ప్రమాదభరితంగా ఉంటుంది. గణపవరం నుంచి ఏ మార్గంలో వెళ్లాలన్నా గుంతల గండం దాటి వెళ్లాల్సిందే. గణపవరం నుంచి ఏలూరు, భీమవరం, ఆకివీడు వెళ్లే ప్రధాన రహదారుల పరిస్థితి దారుణంగా ఉంది. ఏలూరు రోడ్డుపై పలు చోట్ల పెద్ద గోతులు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బువ్వనపల్లి, మందలపర్రు, నిడమర్రు గ్రామాల పరిధిలో చాలా చోట్ల గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇక గణపవరం నుంచి భీమవరం వెళ్లే ప్రధాన రోడ్డు అడుగడుగునా గోతులమయంగా ఉంది. ఇటీవల గోతులకు ప్యాచ్ వర్క్ చేసినా పెద్దగా ఫలితం లేదు. ఈ రోడ్డుపై రాత్రి వేళల్లో ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. గత వారం రాత్రి సమయంలో ఈ రోడ్డు మీద ద్విచక్ర వాహనంపై వెళుతున్న దంపతులు మోటార్ సైకిల్ చక్రం గోతిలో పడిన ప్రమాదంలో భార్యాభర్తలు గాయపడి ఆసుపత్రి పాలయ్యారు. ఈ రోడ్డు పొడవునా ఉండి వరకూ 12 కిలోమీటర్లూ ఇదే పరిస్థితి. ఇక గణపవరం నుంచి ఆకివీడు వెళ్లే రోడ్డు కూడా పలు చోట్ల గోతులు పడి ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. క్రొవ్విడి నుంచి పెదకాపవరం వరకూ రోడ్లు పూర్తిగా ధ్వంసమై, వాహనాల రాకపోకలకు ఏ మాత్రం పనికి రాకుండా తయారైంది. విడువకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఈ రోడ్ల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది.